ప్రజాశక్తి
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025
5
విజయనగరం

జాతీయస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు నాలుగు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23 నుంచి 25వరకు గుంటూరులో జరిగిన జాతీయస్థాయి సౌత్ జోన్ పోటీల్లో జిల్లా ఎథ్లెట్స్ నాలుగు పతకాలు సాధించారు. వారిలో పి.వసంత కాంస్యం. 4x100లో కాంస్యం, ఎ. దివ్య 4x100లో కాంస్యం , ఎం.హరీష్ 3వేల మీటర్ల పరుగులో కాంస్యం సాధించారు. గెలుపొందిన క్రీడాకారులను కోచ్‌లు సతీష్, మధు, శేఖర్లనుజిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, కోశాధికారి ఆనంద్ కిషోర్ అభినందించారు.

పతకాలు సాధించిన వసంత, దివ్య

మన ఊరును బాగు చేసుకుందాం : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కనీసం రోజుకో గంటపాటైనా సేవ చేయడం ద్వారా మన ఊరును బాగుచేసుకుందామని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హై సేవ కార్యక్రమాన్ని కలెక్టరేట్లో గురువారం ప్రారంభించారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ విజయనగరం సాధించేందుకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 12 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్‌దిన్, ఏక్ గంటా, ఏక్ సాథీ నినాదంతో ముందడుగు వేయాలని కోరారు. మన ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. దీనివల్ల పరిసరాలు శుభ్రంగా ఉండటంతోపాటు, పర్యావరణ పరిరక్షణ, వివిధ రకాల వ్యాధుల నివారణకు దోహదపడుతుందని సూచించారు. అందువల్ల ప్రతీఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములుకావాలని కోరారు. మన ఊరు బాగుండాలంటే అందుకు మనమే ముందుడగు వేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీరోజు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నామని, అయినప్పటికీ కొంతమంది చెత్తను పారిశుధ్య కార్మికులకు ఇవ్వకుండా, కాలవల్లోను, రోడ్ల పక్కన వేసేస్తున్నారని చెప్పారు. ఈ అలవాటును మానుకోవాలని, కార్మికులు ఇంటివద్దకు వచ్చినప్పుడే చెత్తను అందజేయాలని సూచించారు. మన విజయనగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీఒక్కరూ తమవంతు సహకారాన్ని అందజేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జెసి సేధుమాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, సిపిఒ పి.బాలాజీ, ఇతర అధికారులు, పలువురు నాయకులు, వివిధ శాఖల సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఆవరణలో చీపురుతో చెత్త ఊడ్చుతున్న కలెక్టర్

రూ.56కోట్లతో 102 చెరువుల అభివృద్ధి

విజయనగరంకోట : జలవనరుల శాఖ ద్వారా రిపేర్, రెనోవేషన్, రెస్టొరేషన్ (ఆర్ఆర్ఆర్) కింద రూ.56 కోట్ల అంచనాతో 102 చెరువుల అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. గురు వారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటివనరుల పునరుద్ధరణ , పరిరక్షణ, , ఆక్రమణల నుండి రక్షించడం, తాగునీటి లభ్యతను పెంచడం , భూగర్భ జలాల రీచార్జ్ కు ఉద్దేశించిన ఈ పథకం అమలుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించనున్నాయని తెలిపారు. జిల్లాలో 7900 చెరువులు ఉండగా, వాటిలో కేవలం 102 చెరువులకే ప్రతిపాదనలు పంపడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలాల వారీగా నున్న చెరువులను పరిశీలించి ఈ నిబంధనల కిందకు వచ్చే వాటిని గుర్తించి మరిన్ని ఎక్కువ చెరువుల అభివృద్ధికి కృషి చేయాలని జలవనరుల శాఖ అధికారులకు ఆదేశించారు. ఆర్ ఆర్ ఆర్ నిబంధనల లోనికి రాని చెరువులు ఏ కారణంగా ఈ పరిధిలోకి రాలేదో కారణాలను కూడా వివరించాలని తెలిపారు. వారానికల్లా మరో 500 చెరువులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. సమావేశంలో జలవనరుల శాఖ ఇఇ రమణ, పెద్దగెడ్డ రిజర్వాయర్ ఇఇ పదీప్, డిఇలు పాల్గొన్నారు.

సిటియు పనులను వేగవంతం

విజయనగరంటౌన్ : కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో నిర్మితమవుతున్న గిరిజన యూనివర్సిటీ పనులపై తమ ఛాంబర్లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. పనుల స్థితిగతులను ఆరా తీశారు. సుమారు 1.3 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన యూనివర్సిటీ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైర్లు, గేటు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెలుపలికి జరిపేందుకు చర్యలు ప్రారంభించాలని, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాయాలని సూచించారు. తాగునీటిని సరఫరా చేసే నిర్మాణాలన్నీ పూర్తి అయ్యాయని, పంప్‌హౌస్‌లకు విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇతర నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎపిఈపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఒ కవిత, ఆర్ అండ్‌బి ఎస్ఒ కాంతిమతి, బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహన్, ట్రాన్స్‌కో ఇఇ శ్రీచరణ్, డి-సెక్షన్ సూపరింటిండెంట్ టి.గోవింద, ఆయా మండలాల తాహశీల్దార్లు, యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యూరియా కోసం ప్రైవేటు ఎరువుల షాపు వద్ద వేచి ఉన్న రైతులు

వెంటాడుతున్న యూరియా కొరత

- కావాల్సింది 1093 మెట్రిక్ టన్నులు .. ఇచ్చింది 983 మెట్రిక్ టన్నులు
- వారం రోజుల కిందట ఇచ్చిన స్లిప్పులకు ఇంకా అందని యూరియా

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఖరీఫ్ సీజన్ ఈ నెలాఖరుతో ముగుస్తున్నప్పటికీ యూరియా కొరత రైతులను వెంటాడుతూనే ఉంది. వేసిన వరి పంట పొట్ట దశకు చేరింది. అయినప్పటికీ రైతులకు అవసరమైన యూరియా అందక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమకు పలుక బడి ఉన్న చోటల్లా అప్పులు చేసి వరి పంటను వేసామని అయితే ఆ పంటకు అందించాల్సిన యూరియా తగినంత అందక పోవడంతో తాము నష్టపోతామేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతున్నాయి వాతావరణం వరి పంటకు అనుకూలంగా ఉన్నప్పటికీ యూరియా సకాలంలో వేయకపోతే నష్టపోతామే మోనని రైతుల చెబుతున్నారు. యూరియా కోసం ఈ నెల 16, 17, 18, 19 తేదీలలో రైతులకు స్లిప్పులు ఇచ్చినప్పటికీ వారం రోజుల అవుతున్నా వారిక యూరియా అందడం లేదంటూ రైతులు వాపోతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంటను 2,604 హెక్టార్లలో రైతులు వేశారు. మరో 1350 హెక్టార్లలో మొక్కజొన్న పంటను పండిస్తున్నారు. దీనికి సంబంధించి 1093 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రారంభం నాటి నుండి ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలకు 282 మెట్రిక్ టన్నులు, పిఎసియస్‌లకు 168 మెట్రిక్ టన్నులతో పాటు ప్రైవేటు డీలర్లకు 533 మెట్రిక్ టన్నులు వెరసి 983 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే రైతులకు అధికారులు అందజేశారు. ఇంకా 110 మెట్రిక్ టన్నుల యూరియా ప్రభుత్వం నుండి రావాల్సి ఉంది. అయితే ఖరీఫ్ సీజన్ ఈ నెలాఖరు నాటికి పూర్తి కానుండటంతో యూరియా కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా రైతులకు యూరియా ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధిక మొత్తంలో వాడడం వల్లనే ఇబ్బందులు

వాడవలసిన దానికంటే రైతులు ఎక్కువ మొత్తంలో ఎరువులు వాడడం వల్లనే యూరియా కొరత వచ్చింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు 983 మెట్రిక్ టన్నుల యూరియాని రైతులకు అందజేశాం. ఇంకా అవసరమైతే రైతులకు యూరియా అందిస్తాం.

- సూర్యకుమారి,
వ్యవసాయ శాఖాధికారి చీపురుపల్లి

ఎంపిపి, వైస్ ఎంపిపిలపై అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి - బొబ్బిలి

బాడంగి ఎంపిపి భోగి గౌరి, వైస్ ఎంపిపి బొమ్మినాయుని రమేష్‌పై టిడిపి ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాస తీర్మానం కాపీని గురువారం ఆర్‌డిఒ రామ్మోహనరావుకు టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవి, ఎంపిటిసిలు అందించారు. బాడంగి మండలంలో 14 ఎంపిటిసిలకు గాను 7 స్థానాల్లో వైసిపి, మరో 7 స్థానాల్లో టిడిపి సభ్యులు విజయం సాధించారు. సమానంగా ఎంపిటిసిలు రావడంతో గతంలో లాటరీ పద్ధతిలో ఎంపిపిని, ఒక వైస్ ఎంపిపిని వైసిపి, మరో వైస్ ఎంపిపిని టిడిపి కైవసం చేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కోడూరు-2 ఎంపిటిసి మరిపి శ్రీదేవి వైసిపిని వీడి టిడిపిలో చేరగా రెండు రోజుల క్రితం గూడెపువలస ఎంపిటిసి పూడి సింహాచలం వైసిపిని వీటి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దీంతో టిడిపి బలం 9 మందికి చేరింది. దీంతో ఎంపిపి భోగి గౌరి, వైస్ ఎంపిపి బొమ్మినాయుని రమేష్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు.

ఎంపిపిగా యజ్జల లక్ష్మి

బాడంగి ఎంపిపి స్థానం ఎస్‌సి రిజర్వేషన్ కావడంతో టిడిపి ఎంపిటిసి యజ్జల లక్ష్మికు ఎంపిపి పదవి వరించనుంది. టిడిపిలో దీర్ఘకాలికంగా పని చేస్తున్న లక్ష్మి బొత్సవానివలస ఎంపిటిసిగా విజయం సాధించారు. సర్పంచ్‌గా, ఎంపిటిసిగా పని చేశారు. టిడిపిలో ఎస్‌సి ఎంపిటిసి ఆమె ఒక్కరు మాత్రమే ఉండడంతో ఆమెను ఎంపిపిగా ఎన్నుకోనున్నారు.

ఆర్‌డిఒకు తీర్మానం కాపీని అందజేస్తున్న ఎంపిటిసి సభ్యులు

వైస్ ఎంపిపి రేసులో పాలవలస గౌరు

బాడంగి వైస్ ఎంపిపి రేసులో గజారాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు రేసులో వున్నారు. వైస్ ఎంపిపి పదవి తనకు కేటాయించాలని ఇప్పటికే గౌరు టిడిపి పెద్దలను కలిసి కోరినట్లు చర్చ జరుగుతుంది. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటున్నారు. వైసిపి హయాంలో టిడిపిని వీడి వైసిపిలో చేరాలని ఎన్ని బెదిరింపులు చేసిన భయపడకుండా టిడిపిలో ఉన్నారు. గతంలో ఎంపిపి ఎన్నికలో వైసిపికు మద్దతు ఇస్తే వైస్ ఎంపిపి ఇస్తామని చెప్పినప్పటికీ ఆయన పార్టీ మారలేదు. ఇప్పుడు టిడిపికి అవకాశం రావడంతో తనకు వైస్ ఎంపిపి ఇవ్వాలని గౌరు కోరుతున్నారు.

దీర్ఘకాలిక బకాయిలపై కొరడా

పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణాల దీర్ఘకాల అద్దె బకాయిలను రాబట్టడంలో రెవెన్యూ సెక్షన్ సిబ్బంది కృషి సత్ఫలితాలనిస్తోంది. గురువారం స్థానిక జనతా బజార్ వద్ద నున్న 72 దుకాణాల అద్దెలను వసూలు చేసే ప్రక్రియలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ ద్వారా సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అయితే 72 దుకాణాలలో 18 దుకాణదారులు దీర్ఘకాల బకాయిలు ఉండడంతో వాటిని రాబట్ట గలిగారు. 13 దుకాణాలకు సంబంధించిన అద్దెలను 2,93,000 రూపాయలు వసూలు చేశారు. మిగిలిన 5 దుకాణాలలో 4 దుకాణాలకు సీజ్ చేశారు. ఒక దుకాణదారుడు త్వరలోనే చెల్లిస్తానని మాట ఇవ్వడంతో సమ్మతించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మాట్లాడుతూ సకాలంలో అద్దెలు చెల్లించకపోవడం వల్ల దుకాణదారులకు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. అందువలన నోటీసులు జారీ చేయడంతో పాటు బకాయిల వసూలుకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. దీర్ఘకాల బకాయిలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామా కార్యాలయంలోకి మారిన డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నెల్లిమర్ల మిమ్స్ హాస్పటల్ పక్కన ఉన్న డ్వామా భవనంలోకి మార్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె,రేఖ తెలిపారు. 2019లో కళాశాల ప్రారంభం నుండి, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో షిఫ్ట్ పద్ధతిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నడుస్తున్న విషయం అందరికీ తెలిసిందే. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా కేటాయించిన డ్వామా బిల్డింగులోకి మార్చినట్లు తెలిపారు. దసరా సెలవులు అనంతరం విద్యార్థులు క్లాసులకు అక్కడే హాజరు కావాలని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలుకోర్సులకు అనుమతి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనంగా భౌతిక శాస్త్రం, బోటనీ విభాగాల్లో మేజర్ కోర్సులకు అనుమతి మంజూరు అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రేఖ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న ఎనిమిది మేజర్ కోర్సులతో పాటు రెండు అదనపు కోర్సులు చేరి మొత్తం పది మేజర్ కోర్సులు అయ్యాయి. రెండో ఫేజ్ అడ్మిషన్లు ఈనెల 26నుండి ప్రారంభమవు తాయని, మొదటిఫేజ్‌లో ఇచ్చిన వెబ్ ఆప్షన్లు అక్టోబర్ 3న మార్చుకోనే అవకాశం కల్పించారని తెలిపారు. 6న కౌన్సిలింగ్ ఫైనల్ లిస్టు వెలబడుతుందని తెలిపారు. రెండో దఫా అడ్మిషన్లు 6న జరుగుతా యన్నారు. ఈ అవకాశాన్ని ఫిజిక్స్ బోటనీ మేజర్ కావలసిన విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వినూత్నంగా పుష్ప ప్రదర్శన : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 28 నుంచి పట్టణంలో ప్రారంభం కానున్న అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్-2025)తో పాటు పుష్పప్రదర్శనను వినూత్నంగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. సరస్, ఫల పుష్ప ప్రదర్శన కోసం స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం కలెక్టర్ పరిశీలించారు. సందర్శకులు ఇబ్బంది పడకుండా చూడాలని, ముఖ్యంగా వాహనాల పార్కింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. డ్వాకా సంఘాలు ఉత్పత్తి చేసిన వస్తువుల ప్రదర్శనలు, అమ్మకాలు సజావుగా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ ఎపిడి కె.సావిత్రి, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, ఉద్యానశాఖ డిడి కె.చిట్టిబాబు, అధికారులు పాల్గొన్నారు.

సింగర్ సురేష్‌కు సన్మానం

విజయనగరం కోట : జానపద గీతాలను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉన్నారని ఢీ- షో సింగర్ సురేష్ పేర్కొన్నారు. సురేష్‌కు కనపాకలో అన్నదాత సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను పాడిన జానపద గీతాన్ని లక్షలాదిమంది ఆదరించడం జీవితంలో మరువలేనని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ సంస్థ నిర్వాహకురాలు కాంచన మాట్లాడుతూ బొప్పడాం గ్రామంలో జన్మించిన జానపద గాయకుడు సురేష్ ప్రజల ఆదరణ పొందడం మన జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.



వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని తన నివాసంలో విజయనగరం జెడ్‌పి ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిరి సహస్ర జగన్మోన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. **- ప్రజాశక్తి, కంటోన్మెంట్**

లెప్రా సొసైటీకి అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

1989 నుండి కుష్టు వ్యాధి సంరక్షణలో ముందంజలో ఉన్న ప్రముఖ స్వచ్ఛంద సంస్థ లెప్రా సొసైటీకి ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌత్-ఈస్ట్ ఆసియా రీజియన్, లెప్రా సొసైటీకి పబ్లిక్ హెల్త్ ఛాంపియన్ (ఇనిస్టిట్యూషన్ కేటగిరీ) అవార్డు ప్రదానం చేసింది. వైద్య రంగంలో వినూత్నలో అగ్రగామిగా నిలుస్తూ, వికలాంగత నివారణకు కస్టమ్-మేడ్ ఫుట్‌వేర్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేసింది. 11 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లెప్రా కుష్టు వ్యాధితో పాటు, క్షయవ్యాధి, హెచ్ఐవి, భోధకాలు, కోవిడ్-19 వంటి ఇతర ఆరోగ్య సమస్యలను కూడా పరిష్కరించడానికి తన సేవలను విస్తరించింది. ఈ సందర్భంగా లెప్రా సిఇఒ ప్రశాంతకుమార్ నాయక్ 'ఈ అవార్డు మా ఆరోగ్యసిబ్బంది, వాలంటీర్లు, భాగస్వాముల అంకితభావాన్ని ప్రతిబింబిస్తోంది.' అని పేర్కొన్నారు. మరింత మంది అట్టడుగు వర్గాల ప్రజలకు సమగ్ర వైద్య సేవలను అందిస్తామని తెలిపారు.

యూనియన్ బ్యాంకు కార్ కార్నివాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలం ఆధ్వర్యంలో నగరంలో గురువారం దసరా ఉత్సవాల సందర్భంగా కార్ కార్నివాల్ ఉత్సవాన్ని యూనియన్ బ్యాంక్ కంటోన్మెంట్ శాఖ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు అతితక్కువ వడ్డీరేట్లకు కార్ల ఋణాలను అందిస్తూ-లబ్ధిదారులకు కొత్త కార్లను బ్యాంకు జనరల్ మేనేజర్ శాలిని మీనన్ చేతుల మీదుగా అందజేశారు. విజయనగరం లోని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉన్న అన్ని శాఖల్లో నగరంలో 10 బ్రాంచ్‌లు కార్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా శాలిని మీనన్ మాట్లాడుతూ తమ బ్యాంక్ ఖాతాదారులకు సరళమైన రేట్లకు సులభ పద్ధతుల్లో కారులను దసరా ఆఫర్ గా అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి జిఎస్‌టి తగ్గించడంతో కొనుగోలుదారులు ముందుకు వచ్చి కారులను కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ జితేంద్ర శర్మ, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, స్థానిక బ్యాంకు మేనేజర్ జి.మల్లేశ్వరరావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు, వివిధ శాఖల మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కారు తాళాన్ని అందజేస్తున్న బ్యాంకు జిఎం శాలిని మీనన్

నేడు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పర్యటన

కంటోన్మెంట్ : రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ శుక్రవారం జిల్లాలో పర్యటిస్తారని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే 'నవరాత్రి పోషణ్ మహా ప్రోగ్రాం' కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్ ను సందర్శిస్తారని తెలిపారు.

సైబర్ నేరాల ఛేదనకు చర్యలు

విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టీ

ప్రజాశక్తి- కంటోన్మెంట్

సైబర్ నేరాలను ఛేదించేందుకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విజయనగరం రూరల్ సర్కిల్ కార్యాలయం, మహిళా పోలీసు స్టేషను, ట్రాఫిక్ పోలీసు స్టేషను సందర్శించి, ఆయా పోలీసు స్టేషన్లు, సర్కిల్ ఆఫీసులకు సంబంధించిన రికార్డులు, సిడి ఫైల్స్‌ను తనిఖీ చేశారు. రూరల్ సర్కిల్ ఆఫీసు పరిధిలోని విజయనగరం రూరల్, గంట్యాడ పోలీసు స్టేషన్లులో పరిష్కారం కాకుండా ఉన్న సైబరు కేసులు, గంజాయి కేసులను త్వరితగతిన ఛేధించి, నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. బాలికలపై జరుగుతున్న లైంగిక అఘాయిత్యాల్లో నిందితులు శిక్షింపబడే విధంగా, త్వరితగతిన ప్రాసిక్యూషను పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంవి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలానాలు విధించాలన్నారు. మైనర్లుకు వాహనాలు ఇవ్వడం కూడా నేరమన్న విషయాన్ని వాహన యజమానులు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. మహిళా, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లులోని రిసెప్షన్, ఇతరు గదులను పరిశీలించి, రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేసి, పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలపై సమీక్షించారు. నేరాలు నియంత్రణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి నేరాలను అదుపు చేయాలన్నారు. అనంతరం, పోలీసు సిబ్బందితో డిఐజి మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిఐజి వెంట ఎస్‌పి ఆర్.దామోదర్, అదనపుఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు చర్యలు

పైడితల్లమ్మ అమ్మవారి పండగ, విజయ నగరం ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని డిఐజి గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఇతర పోలీసు అధికారులతో కలిసి హుకుంపేట, పైడితల్లమ్మ దేవాలయం, క్యూ లైన్లు, దేవాలయం వెనుక భాగం, కమాండ్ కంట్రోల్ రూం, మూడు లాంతర్లు, గురజాడ అప్పారావు రోడ్డు, కోట జంక్షను ప్రాంతాలను, గుర్తించిన పాత భవనాలను స్వయంగా సందర్శించి, క్షేత్ర స్థాయిలో భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అమ్మవారి పండగ, ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు బందోబస్తు, భద్రత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చైన్ స్నాచింగ్, ఈవ్ టీజింగు జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వారి వెంట డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, సూరి నాయుడు, దేవాదాయ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, పలువురు ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డిఐజి గోపీనాథ్, ఎస్‌పి తదితరులు

ఘనంగా ఫార్మాసిస్టుల దినోత్సవం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఫార్మసిస్టుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ అల్లు పద్మజ, డిఎంహెచ్ఒ ఎస్.జీవన రాణి, ఎపి ఎంఎస్ఐడిసి ఇఇ ఎన్.భారతి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల ఫార్మసిస్టుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ మందులు అందించడంలోనూ, వ్యాక్సిన్ నిల్వ చేయడంలోనూ ఫార్మసిస్టుల కీలకపాత్ర అన్నారు. రోగులకు ఔషధాలు అందించే సమయంలో ఫార్మసిస్టులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎపి ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సన్యాసినాయుడు మాట్లాడుతూ గ్రేడ్ వన్ ఫార్మసిస్టులో పోస్టులను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పలువురు ఫార్మసిస్టులను సన్మానించారు. కార్యక్రమంలో ఎపి ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.గోపాలరావు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సంజీవరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు ఆర్.సుబ్రహ్మణ్యం, బివిఎ ప్రసాద్, కె. అప్పల నాయుడు, కె.మల్లేశ్వరరావు, డి.మృత్యుంజయరావు, పి.సూరప్పడు, జె. బుచ్చిలింగం, వై.జోగారావు, జి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ..

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మస్యూటిక్స్ విభాగం ఆధ్వర్యంలో డిసల్యూషన్ స్టడీస్‌పై వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, విశాఖపట్నం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అన్నమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించారు. ఎయు కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఫార్మసిస్ట్ డే ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామయ్య, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి

ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

బొబ్బిలి : ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని భాస్కర ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ తూముల భాస్కరరావు అన్నారు. పట్టణంలో గురువారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో ఫార్మాసిస్టులు కీలకంగా ఉన్నారన్నారు. ప్లాస్టిక్ వాడకం, దోమలు వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై నినాదాలు చేసి ప్రజలకు వగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. అమరావతిలో గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలి ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు గ్రోత్ సెంటర్‌ను గతంలో ఎన్‌టిఆర్ ఏర్పాటు చేశారన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రోత్ సెంటర్‌లో ఎక్కువ ఫెర్రో పరిశ్రమలు ఉన్నాయని, ఆయా పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్న ప్రొడక్ట్ ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారని చెప్పారు. గ్రోత్ సెంటర్‌లో మినీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఫెర్రో పరిశ్రమలకు అండగా ఉండాలని కోరారు. గ్రోత్ సెంటర్‌లో వైసిపి హయాంలో అప్పటి మంత్రికి కారుచౌకగా భూమి కేటాయించారని, రైతులకు ప్రజలకు తాగునీరు అందించే వేగావతి నది నుంచి పరిశ్రమకు నీరు ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయని భూములను రద్దు చేయాలని, నూతన పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అనాథ బాలికలకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అమ్మా నాన్నలను కోల్పోయి అనాథగా ఉంటున్న బాలికలకు 5 సైకిళ్ళు పంపిణీ చేసారు. స్థానిక భవిత కేంద్రం వద్ద గురువారం బాలికా విద్యను ప్రోత్సహించటంలో భాగంగా వసుదైక కుటుంబం, యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి ఈశ్వరరావు ఈ సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు వారి సంరక్షకులు, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎజిఎల్‌లో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ఎజిఎల్ కళాశాలలో ఓటరు అక్షరాస్యత వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని గురువారం 'భారత స్వాతంత్ర ఫలం మహాత్మా గాంధీ పాత్ర, స్వాతంత్రం అనంతరం దేశంలో జాతిపిత కోరుకున్న మార్పులపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు దొడ్డి సూర్యారావు, విశ్రాంత తహశీల్దార్ వి.సన్యాసప్పుడు, కాలేజీ అధ్యాపకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని ఎఒ యం.శ్యాంసుందర్ అన్నారు. గురువారం కారాడ గ్రామంలో ఇండ్-గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఉత్పత్తి చేసే ఉత్పాదకాలకు గ్యాప్ సర్టిఫికేషన్ ఇస్తామన్నారు. ఈ సర్టిఫికేషన్ వల్ల రైతులకు వారు పండించే ఉత్పత్తులకు మద్దతు ధర కంటే అధికంగా అమ్ముకోవడానికి ఓపెన్ మార్కెట్లో వెసులుబాటు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు ఐశ్వర్య, వ్యవసాయ విస్తరణాధికారి సంతోషి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని సిహెచ్ బొడ్డవలసలో గురువారం ఆయిల్ పామ్ పంటల పై రైతులకు ఉద్యాన శాఖ అధికారి ఎస్. వెంకటరత్నం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగు విధానం, రైతులకు కలిగే ప్రయోజనాలు, ఏడాది పొడవునా ఆదాయం గురించి వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల సర్పంచ్‌లు, ఉద్యాన సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- రాజాం

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో గురువారం ఆదర్శనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ యు.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ బి భాస్కరరావు, టిఇ లక్ష్మణరావు అభ్యర్థన మేరకు ఐటిఐ విద్యార్థులకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 200 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు, బి.పి, మధుమేహం, మొదలగు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్య కుమార్, పి సూర్యరావు, కొల్ల యశశ్, యు శ్రీకాంత్, టి శ్యామల, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి సాగును పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడ గ్రామంలో గురువారం శాస్త్రవేత్తల బృందం వరి పంటను పరిశీలించింది. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.లక్ష్మణ మాట్లాడుతూ వరి పంటలో ఎక్కువగా ఎర్రబడటం గమనించామన్నారు. ఇది పొటాష్ లోపంగా గుర్తించామని, కొన్నిచోట్ల నత్రజని లోపం కూడా గుర్తించామని చెప్పారు. దీని నివారణకు ఒక ఎకరం వరి పొలానికి యూరియా ఎరువు 30 కిలోలు, పొటాష్ ఎరువు 15 నుండి 20 కేజీలు కలిపి వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభూషణరావు, ఎఒ టి.సంగీత, టిడిపి నాయకులు పాణిరాజు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న జెసి రాజు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్పృహ తప్పి పడిపోయి ఉన్న మహిళను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు జెసి రాజు మాస్టర్. సీతానగరం మండలం చినభోగిలికి చెందిన రాపాక యశోద రోడ్డు పక్కన గురువారం స్పృహ తప్పి పడిపోయినప్పటికీ చూసిన వారంతా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. పడిపోయి ఉన్న మహిళను చూసిన జెసి రాజు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వాహనం రాకపోవడంతో పట్టణ సిఐ సతీష్‌కుమార్‌కు సమాచారం ఇచ్చి ఆటో సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. దీంతో జెసి రాజును పలువురు అభినందిస్తున్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

గజపతినగరం : మండల వ్యాప్తంగా యూరియా నిల్వలు అవసరానికి తగినట్లు అందుబాటులో ఉన్నాయని ఎఒ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో సుమారు 5,850 హెక్టార్లలో సాగు చేస్తున్నారని దీనికి 1065 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకూ 1060 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా అధిక వాడకం కారణంగా ఆకుముడత పురుగు, పొడతెగులు, అగ్గి తెగులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు మేరకే ఎరువులను వాడాలన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన సదస్సులు

గంట్యాడ: మండలంలో ప్రతి గ్రామంలోని హెచ్‌ఐవి వ్యాధి పెరగకుండా ఉండడానికి సదస్సులను పెట్టాలని డిఆర్‌పిఎస్ అప్పలనాయుడు అన్నారు. గంట్యాడ సచివాలయంలో రాష్ట్ర ఎయిడ్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సమక్షంలో గురువారం జరిగిన అడ్వకేసి మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. లింక్ వర్కర్ సీమ్ వారు గ్రామాల్లో హెచ్‌ఐవి పెరగకుండా అవగాహన సదస్సులు పెట్టాలన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు బూడి అప్పలనాయుడు, నడిపూడి సురేష్, సుంకర చక్రి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్, లింక్ వర్కర్ ఆర్ రామ్‌నాయుడు, ఎఎన్‌ఎం, ఆశ వర్కర్లు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కళాశాలల మంజూరుపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

బొబ్బిలి: బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మంజూరుపై ఎమ్మెల్యే బేబినాయన అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎపి స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ కోరారు. గురువారం స్థానిక పూలబాగ్ జంక్షన్ వద్ద నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గం ఏర్పడి 74 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వ జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇవి లేకపోవడం వల్ల కొన్ని వేల మంది విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో చేరి ఫీజులు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా రెవెన్యూ హెడ్ క్వార్టర్ అయిన బొబ్బిలి నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థల లేకపోవడం విచారకరమన్నారు. ఎమ్మెల్యే ప్రజా సమస్యలతో పాటు విద్యార్థుల సమస్యలపై కూడా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ఈ సమావేశంలో బొబ్బిలి డివిజన్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పరిసరాలు పరిశుభ్రత అవసరమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం నగర పంచాయతీ కార్యాలయం నుంచి రామతీర్థం జంక్షన్ వరకు ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామతీర్థం జంక్షన్‌లో మానవహారం చేసి స్వచ్ఛత పరిశుభ్రత కోసం ఒక గంట కేటాయించాలని స్వచ్ఛ శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి.జయరాం, వార్డు కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, నాయకులు లెంక అప్పలనాయుడు, అప్పికొండ, నగర పంచాయతీ, మెప్మా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ప్రాంగణంలో శ్రమదానం

మండల పరిషత్ ప్రాంగణంలో ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలు, వ్యర్థలాను తొలగించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ పి.సుదర్శనం, డిప్యూటీ ఎంపిడిఒ కె.శంకర జగన్నాధ్, ఎపిఎం సురేష్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: చీపుర్లతో ఊడ్చుతున్న కౌన్సిలర్లు

బొబ్బిలి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు కోరారు. పట్టణంలోని గురువారం ఏక్ దిన్ - ఏక్ సాత్ - ఏక్ గంట కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ శరత్, కమిషనర్ రామలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు చీపుర్లు పట్టి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిను, పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్డు, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్నాథరావు చీపుర్లు పట్టి పరిశుభ్రం చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగన్నాథరావు, మండల కోఆర్డినేటర్ సిహెచ్ పద్మ, ఎపిఒ హరినాథ్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంలో బజారు జంక్షన్‌లో ఎంపిడిఒ బి.కళ్యాణి ఆధ్వర్యంలో రోడ్లపై చెత్తను సేకరిస్తూ, రోడ్లను శుభ్రం చేస్తూ స్థానిక వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాల రాజు, డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్. సుగుణాకర్‌రావు, ఎపిఒ కృష్ణవేణి, ఎంఇఒ విమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం, నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. విస్తరణ, వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగింపులో భాగంగా రామతీర్థం సబ్ స్టేషన్, నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో డి.నెలివాడ ఫీడర్ రామతీర్థం, సీతారామునిపేట, జగ్గరాజుపేట, గొర్లె పేట, కొత్త పేట, సువ్వాని పేట, టొంపల పేట, దన్నాన పేట, కోరాడ పేట, తంగుడుబిల్లి, బిసి కాలనీ, ఎటి అగ్రహారం, తమ్మాపురం, ఆల్తిసాలెం గ్రామాలకు, నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో గుర్ల రూరల్ ఫీడర్ మొయిద నారాయణ పట్నం, పూతిక పేట, కొండ గుంపాం, గరికిపేట, గుర్ల మండలం చింతల పేట, పెద మజ్జిపేట గ్రామాలకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫిర్యాదు చేసినా స్పందించరా?

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడ గ్రామంలో స్థానిక మాజీ సర్పంచ్ దంగా భూలోక ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలల్లో ఆక్రమణలను తొలగించాలంటూ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ యంత్రాంగం స్పందించడం లేదని ఆ గ్రామ సర్పంచ్ ప్రతినిధి బొడ్డు యల్లాజీ, వార్డు మెంబర్ విజ్జపు కిరణ్, ఎస్‌ఎంసి మాజీ చైర్మన్ పిన్నింటి అప్పలనారాయణ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. మాజీ సర్పంచ్ దంగా భూలోక దర్జాగా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని అన్నారు. ఇప్పటి వరకు దంగా భూలోక ఆక్రమణలపై స్పందన కార్యక్రమంలో మూడుసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ యంత్రాంగం చర్యలకు ఉపక్రమించకుండా మీనమేషాలు లెక్కిస్తుందని ఆరోపించారు. కోనాడ రెవెన్యూలోని 44/2 సర్వే నంబర్‌లో 36 సెంట్ల విస్తీర్ణం గల కుంట స్థలాన్ని ఆక్రమించి ఇల్లును నిర్మించుకోవడమే కాకుండా స్థలాన్ని ఆక్రమించి చుట్టూ పెన్సింగ్ వేసి, ఆ పక్కన ఉన్న స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. 105 సర్వే నెంబర్‌లో వాళ్ళ తండ్రికి ఇచ్చిన డీ పట్టా భూమిని జిరాయతిగా మార్చుకొని అక్రమ లబ్ధి పొందుతున్నాడని, సర్వే నంబర్ 104లో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని కూలగొట్టి ఆ స్థలాన్ని కూడా దంగా భూలోక ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. ఇప్పటికైన సంబంధిత యంత్రాంగం ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.

మాజీ సైనికుల వితరణ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని గిరిజన గ్రామాలైన చినమోసూరువలస, చిలకమ్మవలస గ్రామాలలో గురువారం బొబ్బిలి మాజీ సైనిక సంఘం గౌరవ అధ్యక్షులు మరడరామినాయుడు ఆధ్వర్యంలో అధ్యక్షులు రేవళ్ళ కిరణకుమార్ పర్యవేక్షణలో గిరిజన గూడెంలో నివసిస్తున్న గిరిజనులకు దుస్తులు, దుప్పట్లు, తువ్వాళ్లు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న వీరు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు లేక గర్భిణులు డోలీపై వెళ్ళవలసి వస్తుందని, దుర్భరంగా బతుకుతున్నారని వీరికి సహాయపడటం మనందరి కర్తవ్యం అని తెలిపారు. మాజీ సైనికుడు మామిడి ధర్మారావు అక్కడ ఉన్న గర్భిణులకు తమవంతుగా చీర, కొంత ఆర్థిక సహాయం పోషక ఆహారం కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు రెడ్డి రామకృష్ణ, ఎస్ఆర్ మోహన్‌రావు, అలుగోలు గోవింద నాయుడు, విఎన్ శర్మ, గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించరా? : సిఐటియు

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు రోజూ వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వైద్యం నిమిత్తం ప్రజలు అనేక మంది ప్రయాణం చేస్తున్నారని, గతంలో ఈ రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా మారుస్తున్నామని చాలా సౌకర్యాలు వస్తాయని రైల్వే అధికారులు ప్రకటించారని అయినా సౌకర్యాలేవి లేవని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకంరావు అన్నారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఫ్లాట్ ఫారాలు పెంచారని, పాత పార్ట్ వే బ్రిడ్జ్ పగలగొట్టి కొత్త బ్రిడ్జ్ కట్టారని, హార్ట్ పేషెంట్లు, ముడుకులు నొప్పులు ఉన్నవాళ్లు, ఆస్మా ఉన్నవాళ్లు, ముసలివాళ్లు, అంగవైకల్యం, ఆయాసం ఉన్నవాళ్లు ఎవరూ ఈ బ్రిడ్జి ఎక్కలేని పరిస్థితి ఉందని కనీసం ఎక్సలేటర్, లిఫ్ట్ సౌకర్యం కూడా లేదని అన్నారు. స్టేషన్‌లో వైద్య సౌకర్యం, టాయిలెట్స్ సౌకర్యం లేవని అసలు మోడల్ రైల్వే స్టేషన్‌లో ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణానికి కావలసినవి ఏవీ లేవని అన్నారు. విశాఖపట్నం వైపు వెళ్లే ట్రైన్స్ అన్నీ తెల్లవారి 8 గంటలు లోపే వెళ్తున్నాయని, మళ్లీ మధ్యాహ్నం 2గంటల వరకూ ఒక్క ట్రైన్ కూడా లేదని, భవానిపట్నం, విశాఖపట్నం ఉదయం 9గంటలకు వచ్చేటట్లు టైమును మార్చాలని డిమాండ్ చేశారు. సాయంత్రం విశాఖపట్నం నుండి బయలుదేరే దుర్గ్ ఎక్స్‌ప్రెస్‌కు ముందు విశాఖపట్నం, భవానిపట్నం టైమ్‌ను మార్చాలని, విద్యార్థులకు ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉండే టైం పెట్టాలని కోరారు. బొబ్బిలి, విశాఖపట్నంకు రోజూ వేలాది మంది ప్రయాణం చేస్తున్నారని, ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని బొబ్బిలి విశాఖపట్నం పాసింజర్ ట్రైన్ నడపాలని, ఈ సమస్యలపై ఈ నెల 26న ఉదయం 9 గంటలకు నిరసన కార్యక్రమం ద్వారా స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం ఇస్తామని ప్రకటించారు. ప్రయాణికులందరూ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొవాలని సిఐటియు బొబ్బిలి పట్టణ కమిటీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ నాయకులు బి. యుగంధర్ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు నిరంతర నిఘా

ప్రజాశక్తి - రామభద్రపురం

గంజాయి నిర్మూలనకు నిరంతర నిఘా ఉంచామని బొబ్బిలి ఇంచార్జి డిఎస్‌పి రాఘవులు తెలిపారు. గురువారం బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఆధ్వర్యంలో కొట్టక్కి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వివిధ వాహనాలు తనిఖీ చేశారు.

కారులో తనిఖీలు చేస్తున్న డిఎస్‌పి, పోలీసులు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నియంత్రణ, నిర్మూలన ధ్యేయంగా నిరంతరం సిబ్బందితో అన్ని వాహనాలు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా ఒడిశా నుంచి రవాణా అధికంగా జరుగుతున్నట్లు ఉన్న సమాచారం మేరకు చెక్ పోస్టులు వద్ద నిఘా ఉంచామని దీనిపై సమాచారం ఇచ్చే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ప్రజలు సహకరించి వీటి రవాణా అరికట్టడంలో పోలీసులకి సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సహ చట్టాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రజలంతా సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని స్థానిక ఎఒ అమరా శివ సూచించారు. గురువారం సోంపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచార చట్టం - 2005పై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనాయుడు, ఎఇఒ వెంకటరమణ, ఆర్‌ఎస్‌కె సిబ్బంది దినేష్ పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని కొమెరి వెంకటాపురంలో గురువారం ఎఒ శ్రీనివాసరావు రైతులకు సహచట్టంపై అవగాహన కల్పించారు. 2005 సమాచార హక్కు చట్టం ప్రకారం గ్రామపంచాయతీ, మండలం, జిల్లాలో ఏ శాఖకు సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధుల నిధులు, విధులు, జమలు, ఖర్చులు వంటివి అడిగే హక్కు ఉందని అన్నారు.

బొండపల్లి: మండలంలోని గిట్టుపల్లి గ్రామంలో గురువారం సమాచార హక్కు చట్టంపై ఎఒ పి.వి మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో గజపతినగరం వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మల్ జ్యోతి సమాచార హక్కు చట్టపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి బిందు, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: సమాచార హక్కు చట్టంపై గురువారం పురిటిపెంటలో ఎఒ కిరణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

సిబ్బంది గైర్హాజరుపై ఫిర్యాదు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది గైర్హాజరుపై సర్పంచ్ కె.పోలమాంబ, వైస్ సర్పంచ్ పి సరస్వతి, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు ఎంపిడిఒ వై.భవానికి, ఇతర అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ గత 40 రోజుల నుంచి విధులకు హాజరు కాలేదన్నారు. సర్వేయర్ మూడు నెలల నుంచి ఉద్యోగానికి రాలేదని, ముఖ్యంగా సచివాలయానికి పర్మినెంట్‌గా కార్యదర్శి లేరని ఇంచార్జి కార్యదర్శి ద్వారా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో సచివాలయ సిబ్బంది లేకపోవడంతో ప్రజలు వివిధ పనులపై వచ్చి వెనుదిరుగు తున్నారన్నారు. ముఖ్యంగా డిజిటల్ అసిస్టెంట్, సర్వేయర్‌తోనే పని ఎక్కువగా ఉంటుందని వారే లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. సచివాలయంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేదని దీంతో సచివాలయ సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు సచివాలయానికి వెళ్తే పట్టించుకునే నాథుడే లేడని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులందరికీ ఫిర్యాదు చేశామని వెల్లడించారు. సచివాలయంలో పర్మినెంట్‌గా పనిచేయడానికి కార్యదర్శిని, డిజిటల్ అసిస్టెంట్‌ని, సర్వేయర్‌ని నియమించాలని గ్రామస్తులు కోరారు. లేనియెడల గ్రామ ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఓటర్ల జాబితా 2002 పై సమీక్ష ప్రక్రియను బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఒ) త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ కె.శ్రీకాంత్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని అందరూ బిఎల్‌ఒలకు ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాథరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలు శత శాతం సాధించేందుకు బిఎల్‌ఒలు కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితా 2002 సమీక్ష, ఆ జాబితాతో 2005 ఓటర్ల జాబితా బేరీజు ప్రక్రియలను శుక్రవారం నాటికి శత శాతం పూర్తి చేసి నివేదికలను తనకు అప్పగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, సిబ్బంది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: గ్రామస్థాయిలో బూత్ లెవెల్ ఓటర్ జాబితాలను ప్రక్షాళన చేయాలని తహశీల్దార్ కృష్ణలత, రాజాం నియోజకవర్గం ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ యుగంధర్ కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ జాబితాలకు సంబంధించి 2025 జాబితాను ప్రక్షాళన చేసి, ఖచ్చితమైన ఓటర్ జాబితాను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా విద్యను అభ్యసించాలని పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాతిపతిక విద్య.. అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్య ద్వారానే నైతిక జీవన విలువలు పెంపొందుతాయన్నారు. నైతిక విలువలు లేకుండా ఎంత విద్యావంతులైన వారి చదువు నిష్ప్రయోజనం అన్నారు. ప్రతి బిడ్డ తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. మంచి చెడులు విచక్షణతో విద్యానభ్యసించాలన్నారు. రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ నిజ సంఘటనలు తెలుసుకోవటమే విద్యకాదని మనసుకు ఆలోచించకలిగేలా శిక్షణ ఇవ్వటమే విద్య అన్నారు. మానవుల జీవితాన్ని మార్చగలిగే శక్తి గల ఆయుధం విద్యా అన్నారు. కళాశాల కరస్పాండెంట్ చింత అప్పారావు మాట్లాడుతూ విద్య ద్వారా సామాజిక గుణం, ప్రేమ, దయ పెంపొందిం చుకోవాలన్నారు. ప్రతిభ చూపిన విద్యా ర్థులకు సిఐ చేతులమీదుగా బహుమ తులను అందించారు. అనంతరం రోటరీ సభ్యులు, సాయి కాలేజ్ సిబ్బంది సిఐ సతీష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ వంశీ, రోటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణ, చినబాబు, చందు విద్యార్థులు పాల్గొన్నారు.

అంధకారంలో శ్రీనివాసకాలనీ

ప్రజాశక్తి- శృంగవరపు కోట

పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న శ్రీనివాస కాలనీలో గత పది రోజులుగా వీధి లైట్లు వెలగక అంధకారంలో మగ్గుతుంది. శ్రీనివాస కాలనీ ఎంట్రన్స్ నుండి కుసుమహరనాథ్ గుడి వరకు గల ప్రధాన రహదారితో పాటు పక్క వీధులలో కూడా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ద్విచక్ర వాహనాల నుండి పెట్రోలు దోచే దొంగలు మితిమీరుతున్నారు. ఇదే ప్రధాన రహదారిలో మలుపుల వద్ద వీధిలైట్లు లేకపోవడంతో ఇటీవల ఒక దొంగ మహిళ మెడలో చైను తెంపుకొని వెళ్లిన సంగతి తెలిసిందే. పోలీసు పర్యవేక్షణ కొరవడడంతో ద్విచక్ర వాహనాల చోరీలు కూడా అధికమయ్యాయి. కాలనీలోని కింద బోరింగ్ వద్ద వారంలో ఒకరోజు బర్తడేల పేరిట రాత్రి 12 గంటల తరువాత యువకులు కేకు కటింగులు చేసి కేరింతలు, డాన్సులతో కాలనీవాసులకు ఇబ్బందులు పెడుతున్నా కాలనీలో ఏనాడు పెట్రోలింగ్ చేయని పోలీసులు రాత్రులు కాలనీ వంక కన్నెత్తైనా చూడడం లేదు. దీని వల్ల కాలనీ అంధకారంతోపాటు అశాంతికి కూడా గురవుతుంది. ఈ విషయమై పంచాయతీ కార్య నిర్వహణ అధికారి అనురాధకు తెలుపగా కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని ఫిర్యాదులేవి రాలేదని అయినప్పటికీ పంచాయతీ ఎలక్ట్రీషియన్‌కు తెలియపరచి వీధిలైట్లు వెలిగేలా చూస్తామని అన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు గ్రామంలో గురువారం సచివాలయ ఆవరణలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియోగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమాదేవి 511 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్యాడ వెంకటలక్ష్మి, ఎంపిటిసి ద్వారపూడి మంగమ్మ, ఇఒపిఆర్‌డి రవికుమార్, ఉప సర్పంచ్, టిడిపి గ్రామ పెద్ద కొట్యాడ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి, పిహెచ్‌సి సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బొండపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ, జి.సమీరా ఆధ్వర్యంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించి 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కిషోర్, సిహెచ్ఒ కర్ణ, ఎంపిహెచ్ఇఒ తిరుపతిరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ఎ బాషా, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తే మూల స్థంభం

ప్రజాశక్తి - చీపురుపల్లి

వైసిపికి కార్యకర్తే మూల స్థంభం అని ఆ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరు వైసిపి 2.0లో గ్రామ కమిటీలు, బూత్ లెవెల్ కమిటీలలో భాగంగా మండలంలోని కర్లాం, పికె పాలవలస, పెదనడిపల్లి, చిన్న నడిపల్లి గ్రామాలలో జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడులతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గ్రామ కమిటీలు, బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. వైసిపి నాయకులు బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ, ఈశ్వరరావు, కొయ్యాన రమణ, సింహాచలం, దాలినాయుడు, రెల్లి శివ, బైరెడ్డి లక్ష్మణరావు, బైరెడ్డి సూరి సత్యం, రెల్లి శివ, పిసిని శ్రీను, రేగాన ఆదినారాయణ, సూర పాలరాజ్, గడి రామునాయుడు, మురళి, వెంకి పాల్గొన్నారు.

పానీ పైపులతో రైతులకు మేలు

నెల్లిమర్ల: ఎడబ్ల్యుడి పానీ పైపులతో రైతులకు మేలు కలుగుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయ కర్త శ్రీనివాసరావు తెలిపారు. గురువారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తంగుడుబిల్లి, దేవుని నెలివాడలో పానీ పైపులపై అవగాహన కల్పించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడబ్ల్యు డి పానీ పైపుల వినియోగంవల్ల నీటి ఆదా అయి దిగుబడి పెరుగుతుందని, రైతులకు ఎకరానికి 4వేలు నుంచి 6వేల ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ పైపులు శ్రీకాకుళం, విజయనగరంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపిటిసి చందక చిన్నంనాయుడు, నాయకులు పోతల రాజప్పన్న, మహాలక్ష్మి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

విజయనగరంలోని రాజీవ్ స్టేడియం మేదరవీధికి చెందిన గ్రంధి పైడిరాజు అలియాస్ రాజు (38)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా, బాధితురాలికి రూ.2లక్షలు పరిహారంగా మంజూరు చేయాలని తీర్పు చెప్పినట్లు ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. పైడిరాజు అదే ప్రాంతానికి చెందిన చిన్నారి(4)ను ఈ ఏడాది ఏప్రిల్ 16న తన స్కూటీపై వేరే ప్రాంతానికి తీసుకొని వెళ్ళి, లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. మైనరు బాలికను తల్లి చికిత్స నిమిత్తం గోషాసుపత్రిలో చేర్పించగా, తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై మహిళ పోలీసు స్టేషను డిఎస్‌పి ఆర్.గోవిందరావు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారని తెలిపారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధించినట్లు ఎస్‌పి తెలిపారు. పోలీసుల తరుపున పోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు మెట్టా ఖజానారావు వాదనలు వినిపించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన డిఎస్‌పి గోవిందరావును, ఎఎస్‌ఐ నర్సింహరావు,, హెచ్‌సిలు సిహెచ్. రామకృష్ణ, కెఎ నాయుడు, కానిస్టేబుళ్లను ఎస్‌పి అభినందించారు.

పశువుల కాపరి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడకు చెందిన పశువుల కాపరి చల్ల కృష్ణ (43) రెండు రోజులు క్రితం చంపావతి నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. ఆయన కోసం 16 మంది ఎన్‌డిఆర్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి చంపావతిలో గాలించారు. అయినా వారికి ఆచూకీ దొరకలేదు. చంపావతి ఉధృతి తగ్గడంతో గురువారం ఉదయం మండల వీధి సమీపంలో కృష్ణ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు కృష్ణకు భార్య సత్యవతి, కుమార్తె సోనియా, కుమారుడు బాలాజీ ఉన్నారు. కుమార్తెకు నాలుగు నెలల క్రితమే వివాహమైంది. కొడుకు బాలాజీ ఇంటర్మీడియట్ వరకు చదువుకొని వైజాగ్‌లో పెదనాన్న వద్ద ఉంటున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆంద్ర ఇంఛార్జి ఎస్‌ఐ భాస్కర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

స్పందించారు.. పనులు ప్రారంభించారు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఇంటింటి కుళాయి కోసం తీసిన గోతులతో ఇబ్బందులు అనే వార్త ప్రజాశక్తిలో వెలువడటంతో గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ సత్య కిషోర్ వెంటనే స్పందించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి జల్ జీవన్ మిషన్ ద్వారా పట్టణంలోని శ్రీనివాసకాలనీలో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలకు తవ్విన గోతులను పూడ్చేందుకు కాంక్రీట్ పనులను గురువారం ప్రారంభించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తవ్విన గోతులలో ట్రాక్టర్లు దిగబడిపోవటం, అధిక లోడ్లతో ట్రాక్టర్లు రావటం వల్ల సైడ్ కాలువల అంచులు విరిగిపోవడం జరుగుతుందని శ్రీనివాసకాలనీ ప్రజలు ఆవేదన చెందడంతో ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందించి పనులు ప్రారంభించడంపై కాలనీవాసులు ప్రజాశక్తి విలేకరికి, జెఇఇ సత్య కిషోర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తాత్కాలికంగా పార్కు మూసివేత

బొబ్బిలి: పట్టణంలో ఉన్న రాణి మల్లమ్మదేవి మున్సిపల్ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈనెల 26, 28న పార్కును తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పార్కు ప్రహరీ గోడ నిర్మాణం, ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టేందుకు తాత్కాలికంగా మూసి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

IN THE HONORABLE COURT OF SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM.
I.A 144/2019. O.S. 278/2011.

Between:-
Kandikuppa Mohanarao. ...Petitioner.
And:-
Mandavilli Sambasivarao (died). Others. .....Respondents.

To,
1). Mandavilli Sakunthala, W/o Late Sambasivarao, D. No. 5-16.6/9, Kothagraharam, Vizianagaram.
2). Grandhi Sudhakar, S/o Subbarao, C/o Janapriya Footwear, D. No. 7.2.8, Rangireeju street, Vizianagaram.
3). Mandavilli Sasi, D/o Late Sambasivarao, D.No. 5-16.6/9, Kothagraharam, Vizianagaram.
4). Mandavilli Swetha, D/o Late Sambasivarao, D. No. 5-16.6/9, Kothagraharam, Vizianagaram.

Please take notice that The petitioner filed the above petition to restore the above suit to file and the above said petition is posted to 6.10.2025 for your notice and appearance. If you have got any objections you should attend before the above said Honorable court and submit your objections if any on **6.10.2025 at 10.30 A.M.,** failing which the matter will be decided in your absence.

J. BHEEMASENARAO
Advocates for petitioners.
Vizianagaram Cell 9441053628.